క్లుప్తంగా

ఆరు నామినేషన్ల దాఖలు


జగ్గంపేటలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తోట వాణి

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జగ్గంపేట అసెంబ్లీ స్థానానికి మంగళవారం ఆరుగురు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం, అలాగే తోట వాణి, బీఎస్పీ అభ్యర్థి జుత్తుక నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థి మరోతి శివగణేష్, ఇండిపెండెంట్‌గా పాటంశెట్టి సూర్యచంద్ర, పాటంశెట్టి వెంకట శ్రీదేవి నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు చెప్పారు.

తునిలో నలుగురు..

తుని: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తుని అసెంబ్లీ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి మంగళవారం తెలిపారు. టీడీపీ నుంచి యనమల నాగేశ్వరరావు రెండు సెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా లాలం లోవరాజు, ఆది వెంకట సత్యనారాయణ వేగి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేశారు. వీరికి ఎన్నికల నియమావళిని ఆర్‌ఓ అందజేశారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన


శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

తొండంగి: సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్ జేవీకే కిట్లు భద్రపరిచే స్టాక్‌పాయింట్‌ను మంగళవారం పరిశీలించారు. శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లు భద్రపరిచేందుకు ఐదు గదులను ఏర్పాటు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేస్తారు. జేవీకే కిట్లు అత్యంత భద్రంగా ఉంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇస్మాయిల్ విద్యా శాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట విద్యా శాఖ అధికారులు చామంతి నాగేశ్వరరావు తదితరులున్నారు.

నాని నియామకంపై హర్షం


లక్ష్మణరావు(నాని)

రౌతులపూడి: ఎ.మల్లవరం గ్రామానికి చెందిని సీనియర్ నాయకుడు కాకి లక్ష్మణరావు(నాని) వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులు కావడంపై మంగళవారం పలువురు పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో తన సేవలను గుర్తించి జిల్లా కార్యదర్శి పదవి కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబుకు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌కు ఈ సందర్భంగా నాని కృతజ్ఞతలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా హనుమజ్జయంతి

గోకవరం: హనుమజ్జయంతిని మంగళవారం గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. గోకవరంలోని వందేళ్ల నాటి దాసాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురళీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో, గుమ్మళ్లదొడ్డిలో ప్రధాన రహదారి చెంత ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, అచ్యుతాపురంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

జగ్గంపేట: విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 25న జగ్గంపేట డీఈ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్‌ఎఫ్/ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, స్వతంత్ర సభ్యులు డా.రాయసం సురేంద్రకుమార్ హాజరవుతారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ కారణంగా ప్లేట్‌లెట్లు తగ్గుతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరు గ్రామంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు. డెంగీ వ్యాధికి లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలని చెప్పారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తోట నరసింహం


కిర్లంపూడి నుంచి మోటార్ బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

హోరెత్తిన జనం

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం నామినేషన్ దాఖలు
- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు


రావులమ్మతల్లికి పూజలు చేస్తున్న తోట నరసింహం, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తోట వాణి, రాంజీ


నామినేషన్‌కు భారీ ర్యాలీగా వెళుతున్న తోట నరసింహం

గోకవరం: వేలాదిగా తరలివచ్చిన జనం. కార్యకర్తల హోరు.. జయజయ ధ్వానాలు.. ఇవీ వైఎస్సార్ సీపీ జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం నామినేషన్‌ను ఘట్టాలు. మెట్ట ప్రాంతమైన జగ్గంపేటలో హ్యాట్రిక్ విజయం సాధించాలన్న కృతనిశ్చయంతో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం మంగళవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడి, గండేపల్లి మండలాల నుంచి అశేష జనవాహిని, అభిమానులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో జగ్గంపేట ప్రధాన, జాతీయ రహదారులు కిక్కిరిశాయి. తమ అభిమాన నాయకుడికి మద్దతుగా వేసవి తాపాన్ని సైతం లెక్క చేయకుండా, కార్యకర్తలు, అభిమానులు భారీగా జగ్గంపేటకు చేరుకున్నారు.

రావులమ్మ తల్లి ఆలయంలో పూజలు

నామినేషన్ దాఖలు చేసే ముందు తోట నరసింహం తన సతీమణి తోట వాణి, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, కుమారుడు తోట రాంజీ, కోడలు శ్రీనిధితో కలిసి కిర్లంపూడి మండలం వీరవరంలోని ఆయన స్వగృహం నుంచి భారీ ర్యాలీగా జగ్గంపేటలోని రావులమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి వేలాదిగా పార్టీ అభిమానులు పార్టీ జెండాలు చేతపట్టి ఆలయం వద్దకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి డప్పు వాయిద్యాల నడుమ కోలాహలంగా నామినేషన్ దాఖలు చేసేందుకు తోట నరసింహం భారీ ర్యాలీగా వాహనంపై బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో కార్యకర్తలు.. జై జగన్, జై తోట నరసింహం, జై సునీల్ నినాదాలతో జగ్గంపేట మార్మోగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రానికి చేరుకుని, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు.

భారీగా తరలివెళ్లిన జనం

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం నామినేషన్‌కు మండలం నుంచి బైకులపై భారీ ర్యాలీగా అధిక సంఖ్యలో జనం తరలివెళ్లారు. మండలంలోని 21 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో వీరవరంలోని తోట నరసింహం స్వగృహానికి బయలుదేరారు. అనంతరం తోట నరసింహం, తోట రాంజీ, తోట వాణితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

జగ్గంపేటలో విజయం నాదే : తోట

ఎమ్మెల్యేగా జగ్గంపేటలో విజయం సాధిస్తానని తోట నరసింహం ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ దాఖలు అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశానన్నారు. మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో.. వేలాదిగా తరలివచ్చిన అభిమానుల మధ్య ఇప్పుడు నామినేషన్ దాఖలు చేయడం ఆనందంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు గ్రామగ్రామాన ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. ప్రజల నుంచి వస్తున్న బ్రహ్మాండమైన స్పందన చూస్తుంటే, తప్పకుండా తాను విజయం సాధిస్తానన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి 60 గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సాధ్యమయ్యే హామీలతో, పది అంశాలతో సొంత మేనిఫెస్టో రూపొందించానన్నారు. గెలిచిన వెంటనే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం జగ్గంపేటలోని ప్రధాన కూడలిలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఆశీస్సులతో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ని ఎంపీగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు ముత్యాల శ్రీనివాస్, సుంకర వీరబాబు, దాసరి రమేష్, రావుల గణేష్ రాజా, బండారు రాజా, గపూర్, పెంటకోట నాగబాబు, జోకా శ్రీను, కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి సన్నిధిలో మంత్రి రాజా


లక్ష్మీ గణపతి స్వామిని దర్శించుకుంటున్న మంత్రి రాజా

తుని: కొత్తపేట లక్ష్మీగణపతిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం జరిగే నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావాలని గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి ఎన్నికల్లో విజయాన్ని కటాక్షించాలని కోరుకున్నట్టు మంత్రి చెప్పారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు. తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న బాలకృష్ణ, రాజేశ్వరి

తొండంగి: వాకదారిపేట కేజీబీవీ కేంద్రంలో దివీస్ లేబరేటరీస్ సౌజన్యంతో ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు రక్షిత తాగునీటి కోసం రూ.3.90 లక్షలతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. కంపెనీ ప్రతినిధి ఎస్.బాలకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేశ్వరి దీనిని ప్రారంభించారు.

అభివృద్ధి, సంక్షేమానికే ఓటు వేయండి


గిడజాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని గిడజాం, డీజే పురం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టగా, మహిళలు హారతులిచ్చారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలు చూడకుండా, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గ్రామాల్లోని పేదలకు, రైతులకు, ముఖ్యంగా అక్కచెల్లెమ్మలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి, ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలంటే మరొకసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నాడు–నేడు పథకంలో గ్రామాల్లోని ప్రతి స్కూల్‌ను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండేలా 104, 108లను ప్రజలకు చేరువ చేశారన్నారు. పీహెచ్‌సీలను విస్తరించి, సీహెచ్‌సీలను అత్యాధునిక పరికరాలతో అభివృద్ధి చేశారని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఆయా కార్యక్రమాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, పార్టీ ముఖ్యనేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, జేసీఎస్ చైర్మన్ సర్రం శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ బండారు బైరాగి, నాయకులు సుంకర రామచంద్రరావు, అల్లాడి రాజు, డీజే పురం సర్పంచ్ మిరియాల చిట్టిబాబు, ఎంపీటీసీ కొల్లు పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో లోవకొత్తూరు పంచాయితీ సీతయ్యపేటకు చెందిన పళ్ల ఈశ్వరరావు, సారిపల్లి బాబ్జి, మిరియాల శ్రీను, సతీష్ తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి రాజా కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న పథకాలు, దాడిశెట్టి రాజా నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజా విజయం కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని రాజా అన్నారు.

నేడు దాడిశెట్టి రాజా నామినేషన్

తుని: సార్వత్రిక ఎన్నికల్లో తుని అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దాడిశెట్టి రాజా బుధవారం నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు మంగళవారం తెలిపారు. తుని మండలం ఎస్.అన్నవరం శ్రీదేవి, భూదేవి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాజా దంపతులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అక్కడ నుంచి సూరవరం రోడ్డు మీదుగా కొత్తపేట లక్ష్మీగణపతి ఆలయం, ఆంజనేయ స్వామి గుడి మీదుగా బాలాజీ సెంటర్, గొల్ల అప్పారావు సెంటర్ మీదుగా తుని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారన్నారు. రాజా నామినేషన్‌కు తుని, తొండంగి, కోటనందూరు మండలాలతో పాటు, తుని పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరవుతారన్నారు. రాజా నామినేషన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

భారీగా తరలిరండి

కోటనందూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా నామినేషన్ కార్యక్రమానికి మాదిగలు భారీగా తరలిరావాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. ఎల్లిపేట, కొత్తకొట్టాం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు, భీమవరపుకోట గ్రామాల మాదిగ తండాల్లో మంగళవారం ఆయన పర్యటించి, మాదిగలతో సమావేశమయ్యారు. మాదిగలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రాజా చేసిన మంచిని వివరించారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఎస్.అన్నవరంలో నామినేషన్ ర్యాలీ ప్రారంభమవుతుందని, మాదిగలంతా భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.


మాదిగలతో సమావేశమైన ఆరుగుల మోషే

వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- పార్టీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- అసెంబ్లీ అభ్యర్థి వరుపులతో కలిసి ఎన్నికల ప్రచారం

అన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కోరారు. మంగళవారం రాత్రి ఆయన అన్నవరంలో పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన కారణమని తెలిపారు. తాను ఎంపీగా ఎన్నికైతే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలోని 400 గ్రామాలను దత్తత తీసుకుని, రూ.400 కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పరిశ్రమలు స్థాపించేలా కృషి చేసి, ఏటా వేల సంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పారు. కాకినాడలో రూ.వంద కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ డిగ్రీల వారికి శిక్షణనిచ్చి, అనంతరం ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. అనంతరం వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని గుర్తించి, అఖండ మెజార్టీతో తనను, ఎంపీ అభ్యర్థి సునీల్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

అన్నవరంలో టీడీపీకి చెందిన జిల్లా నాయకుడు సరమర్ల మధుబాబు, ఆయన వర్గానికి చెందిన సుమారు 200 మంది మా పార్టీకి రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, వరుపుల ఆయనకు, ఆయన అనుచరులకు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ 2004లో, 2014లో వరుపుల సుబ్బారావు ఎమ్మెల్యేగా నెగ్గేందుకు కృషి చేశానన్నారు. 2019లో కొన్ని కారణాల వల్ల టీడీపీలో చేరానన్నారు. ఇప్పుడు సొంత ఇంటికి వచ్చినట్టు ఉందన్నారు. పార్టీ అభ్యర్థులు సునీల్, వరుపుల ఘన విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, పార్టీ నాయకుడు శెట్టిబత్తుల రాజబాబు, అన్నవరం సర్పంచ్ కుమార్ రాజా, ఎస్సీ సెల్ నాయకుడు గుడాల రామకృష్ణ, నెల్లిపూడి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దడాల సతీష్, అన్నవరం వైస్ సర్పంచ్ వెంకన్నబాబు, నాయకులు వాసిరెడ్డి జమీల్, కొండపల్లి అప్పారావు, బలువు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు తదితర నాయకులు

ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ మూడు సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీరుకొండ వీరవెంకట సత్యనారాయణ, బీఎస్పీ అభ్యర్థి భార్తి శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మరణించినట్టు ఎస్సై ఎస్ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు, సుబ్బయమ్మపేటకు చెందిన గొల్లవిల్లి అప్పలరాజు(35) ఈ నెల 9న మోటార్ బైక్‌పై వెళుతూ, అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం బంధువులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. ఈ నెల 21న ఫిట్స్ రావడంతో, మరలా కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

తెనాలి నుంచి మామిడికాయల లోడుతో విశాఖపట్నం వెళుతున్న వ్యాన్ డ్రైవర్ తాడితోటి హరి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. మురారి వద్ద వ్యాన్‌ను నిలిపి, కాలకృత్యాలు తీర్చుకున్నాక వాహనం ఎక్కుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తి శ్రద్ధలతో చండీ హోమం

గోకవరం: చైత్రపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దేవీచౌక్ ఆలయంలో మంగళవారం చండీహోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు వల్లూరి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ హోమం జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నారాయణస్వామి

ఏలేశ్వరం: మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న మూది నారాయణస్వామి మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె అచ్చెన్నాయుడు నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు.